క్లుప్తంగా

హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన

పార్వతీపురం టౌన్: హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కోసం క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా టీబీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఎం. వినోద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణంలోని కొత్తవలస కొత్త పోలమ్మ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఈ క్విజ్ పోటీలు నిర్వహిస్తామని 8, 9 తరగతుల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణపై శ్రద్ధ చూపాలి



మొక్కలు నాటుతున్న హెచ్‌డీఎఫ్‌సీ క్లస్టర్ హెడ్ ఎన్.సత్య ప్రసాద్

పార్వతీపురంటౌన్: పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలని హెచ్‌డీఎఫ్‌సీ క్లస్టర్ హెడ్ ఎన్.సత్య ప్రసాద్ అన్నారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా బుధవారం పార్వతీపురం పట్టణంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వారి పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని సంపూర్ణంగా ఉంచేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ అశోక్, ఆపరేషన్ మేనేజర్ సాహు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించాలి



క్రీడాకారులను అభినందిస్తునన్న ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర

పార్వతీపురంటౌన్: జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయిలో పతకాలు సాధించాలని ఎమ్మెల్యే విజయ్ చంద్ర ఆకాంక్షించారు. ఈ మేరకు ఇటీవల రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను బుధవారం ఆయన తన క్యాంప్ ఆఫీసులో అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ఒక బంగారు, మూడు రజత, మూడు కాంస్య పతకాలు సాధించిన విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు పిలుపునిచ్చారు. బంగారు పతకం సాధించి మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు వెళ్తున్న హర్షిత్ శర్మ, కోచ్ అనిల్ కుమార్ శర్మలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.

మున్సిపల్ తోటలకు బహిరంగ వేలం



మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

పార్వతీపురంటౌన్: మున్సిపాలిటీ పరిధిలో గల తోటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2024–25 నుంచి 2026–27 ఆర్థిక సంవత్సరాలకు గాను తోటపల్లి హెడ్ వాటర్ వర్క్స్ ఏరియా వద్ద గల కొబ్బరి, జీడి, మామిడి చెట్ల ఫలసాయం అనుభవించే హక్కు కోసం ఈ నెల 21 ఉదయం 11గంటలకు పురపాలక సంఘం కార్యాలయం ఆవరణలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాటలో పాల్గొనాలనుకున్న వారు ధరావత్తు మొత్తం, సాల్వెన్సీ ధ్రువీకరణ పత్రంతో వేలం హాజరు కావాలని తెలియజేశారు. అదనపు సమాచారానికి పురపాలకసంఘం కార్యాలయం పని వేళల్లో రెవెన్యూ విభాగంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

గ్రంథాలయానికి దారేది..?



శాఖా గ్రంథాలయ ప్రధాన గేట్ వద్ద పరిస్థితి..

పాలకొండ రూరల్: నిత్యం పెద్ద సంఖ్యలో పాఠకులు, నిరుద్యోగ యువత క్రమంతప్పకుండా చేరుకునే సరస్వతీ నిలయానికి దారి లేకుండా పోయింది. స్థానిక నగర పంచాయతీ కార్యాలయానికి ఎదురుగా ఉండే శాఖాగ్రంథాలయం చుట్టూ వ్యర్థాలు పేరుకుపోయాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలు, అక్కడి ప్రాంగణంలో ఉన్న రక్షితసేటి పథకం నుంచి వచ్చే వృథా నీరు, పట్టణంలో సేకరిస్తున్న చెత్తను ఇక్కడే డంప్ చేయడంతో గ్రంథాలయానికి వెళ్లేందుకు కనీసం దారి కూడా లేకుండా పోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పరిసరాలను పరిశుభ్రం చేసి గ్రంథలయానికి దారి సౌకర్యం కల్పించాలని పాఠకులు కోరుతున్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా

- దేశభక్తి భావం, సమగ్రత పెంపొందించాలి
- జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక



ర్యాలీలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక

పార్వతీపురంటౌన్: హర్ ఘర్ తిరంగా కార్యక్రమం జిల్లాలో బుధవారం ఘనంగా జరిగింది. ప్రతి పౌరుడిలో దేశభక్తి భావాన్ని రగిలించి దేశ సమగ్రతను పెంపొందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఎస్.శోభిక ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆజాద్ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్‌సీఎం స్కూల్ సముదాయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. విద్యార్థులతో సాగిన చైతన్య ర్యాలీని జాయింట్ కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌరునిగా దేశ సమగ్రతను, జాతీయ సమైక్యతను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. దేశ సమగ్రతను సామరస్యాన్ని, జాతీయ పతాకం ప్రాముఖ్యతను మరింత పెంపొందించేందుకు హర్ ఘర్ తిరంగా మహోన్నతమైన కార్యక్రమమన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల జీవిత గాథను మననం చేసుకుని దేశాభివృద్ధికి యువత పునరంకితం కావాలని పునరుద్ఘాటించారు. ప్రతి భారతీయుడిలో దేశభక్తి పెంపొందించేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, యువత భాగస్వామ్యులు కావాలని దేశ సమగ్రతను కాపాడే ఈ మహోన్నత కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని, దేశభక్తి పెంపొందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవ నాయుడు, రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత, జిల్లా విద్యా శాఖాధికారి జి.పగడాలమ్మ, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు తదితరులు, పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం వద్ద జాతీయ జెండాలతో విద్యార్థులు

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

సీతానగరం: మండల కేంద్రంలోని పుర వీధుల్లో ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.కుమార వర్మ ఆధ్వర్యంలో బుధవారం మండల స్థాయి అధికారులు, విద్యార్థులు హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ రాములమ్మ, ఏఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ కలెక్టర్ ఉత్తర్వుల మేరకు వాడవాడలా హర్ ఘర్ తిరంగా ఉత్సవాలను నిర్వహించి ప్రతిపౌరునిలో దేశభక్తి భావాన్ని ఇనుమడించేందుకు స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించడం చక్కని కార్యక్రమమన్నారు. కార్యక్రమంలో హెచ్‌డీటీ ఉమామహేశ్వరరావు, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆర్ఐ ఎస్.శ్రీనివాస రావు, పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది, స్థానిక సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పురవీధుల్లో హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న మండల అధికారులు

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషిచేయాలి

- మాజీ ఎమ్మెల్యే జోగారావు



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అందరం కృషిచేయాలని మాజీ ఎమ్మెల్యే జోగారావు కోరారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని చిలకలపల్లిలో ఒక ఫంక్షన్‌కు హాజరైన అనంతరం ఆయన నాయకులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ పార్టీకి మంచి ఓటుబ్యాంకు ఉందని, పార్టీ బలోపేతానికి అందరం కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ ఆదేశాలమేర కార్యక్రమాలను నిర్వహించాలని, ప్రజలలో పార్టీకి మంచి ఇమేజ్ తీసుకురావాలని కోరారు. నాయకులు నిరాశకు గురికావద్దని, పోరాట పటిమతో పార్టీని బలోపేతం చేసుకుందామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, సర్పంచ్ సుందరరావు, ఎస్‌వీ జగన్నాథం మాస్టారు, శేషగిరి, ఎస్.శ్రీనివాసరావు, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

నీటమునిగిన వరి పంట పరిశీలన



వరిచేనులోంచి నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఏఓ ఎస్ అవినాష్

సీతానగరం: మండలంలోని రామవరం గ్రామానికి ఎగువ ప్రాంతంలో వర్షం కురవడం వల్ల వరిచేను పంట పొలాలు నీట మునిగాయి. ఈ మేరకు రైతులు ఇచ్చిన సమాచారంతో మండల ఏఓ ఎస్.అవినాష్, వ్యవసాయ సిబ్బంది నీటమునిగిన వరిచేను పంటలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ అవినాష్ మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురవడం వల్ల రామవరం చెరువులు నిండిపోయిన తరువాత వాలు నుంచి నీరు ప్రవహిస్తోందన్నారు. మడులలో నీరు నిల్వ నష్టం కలుగుతుందని, నీరునిల్వ ఉండే పరిస్థితి లేదు కాబట్టి రైతు సోదరులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు.

మేలైన వ్యవసాయ పద్ధతులపై దృష్టి సారించాలి

ఖరీఫ్ సీజన్‌లో మేలైన పంటదిగుబడుల సాధనకు రైతులు పొలంబడి కార్యక్రమంలో అవగాహన కల్పించుకోవాలని ఏఓ ఎస్ అవినాష్ అన్నారు. ఈ మేరకు ఆయన పొలంబడి కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన బుడ్డిపేట మదర్ థెరిశా ఆశ్రమంలో రైతులకు సదస్సు నిర్వహించారు. వరిచేను పొలాల్లో మిత్ర పురుగులను సంరక్షిస్తూ క్రిమిసంహారక మందుల వినియోగం, కలుపు మందు, మిగిలిన రసాయనాలు వాడే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను సదస్సులో వివరించారు. కార్యక్రమంలో గ్రామసచివాలయ సహాయకులు పి.లక్ష్మణ్ బి.సుధీర్, సీహెచ్ వినయ్, తేజ, రైతులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి అంకిత భావంతో కృషి



మాట్లాడుతున్న తహసీల్దార్ రాములమ్మ

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయడానికి పంచాయతీ పాలకవర్గం అంకిత భావంతో సేవలందించాలని తహసీల్దార్ జె.రాములమ్మ అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కె కుమార్‌వర్మ ఆధ్వర్యలో గ్రామసర్పంచ్‌లు, కార్యదర్శులకు జరుగుతున్న పునశ్చరణ సదస్సులో బుధవారం తహసీల్దార్ జె. రాములమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ పాలకులు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సి ఉందన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం, అక్కడ వీలుకాని సమస్యలను ప్రభుత్వానికి శాఖలవారీగా నివేదికలు సమర్పించి పరిష్కరించడానికి కృషి చేయాలని. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టినప్పుడే ప్రజల్లో గుర్తింపు వస్తుందని వారి సమస్యలు పరిష్కారమవుతాయని తెలియజేశారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ కె కుమారవర్మ మాట్లాడుతూ మూడు రోజులుగా నిర్వహించిన పునశ్చరణ సదస్సుల్లో తెలుసుకున్న విషయాలతో గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారుచేసి వాటి ఆధారంగా క్రమ పద్ధతిన పనులు చేయించాలని సూచించారు. ప్రజలకు తాగునీరు. విద్యుద్దీకరణ, పారిశుధ్య పనుల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సోషల్‌వెల్ఫేర్ స్కూల్‌లో మిగులు సీట్ల భర్తీ

సీతానగరం: మండలంలోని జోగింపేటలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగిలి ఉన్న విద్యార్థుల సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ 5వ తరగతిలో 20, 6వ తరగతిలో 18, 7వ తరగతిలో 16, 8వ తరగతిలో 14, 9వ తరగతిలో 9 ఉన్న ఖాళీ సీట్లకు ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలియజేశారు. అలాగే ఎస్సీ కులానికి సంబంధించి ఇంటర్మీయట్‌లో ప్రవేశాలకు 14 ఖాళీలున్నాయని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యాలయం ప్రిన్సిపాల్‌ను ఫోన్ 91821 93769 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలియజేశారు.

రావమ్మా మహాలక్ష్మీ రావమ్మా..!

- 16న వరలక్ష్మీ వ్రతం
- సిద్ధమవుతున్న మహిళలు
- సందడిగా మార్కెట్‌లు



విక్రయానికి సిద్ధంగా ఉన్న వరలక్ష్మి రూపు కాసులు

పార్వతీపురం: మహిళలకు అలంకరణ అంటే ఎంత ఇష్టమో చెప్పనక్కరలేదు. అందులోనూ సృజనాత్మకతను జోడిస్తూ మనసారా వేడుకుంటూ చేసే వరలక్ష్మి వ్రతాల్లో వారికి అలంకరణే ప్రత్యేక ఆకర్షణ. కట్టుబొట్టు నుంచి నైవేద్యం వరకూ ప్రతిదీ కొత్తగా ఉండాలనుకుంటారు. అమ్మవారితో పాటు దీపాలు, కలశాలు, ముత్తైదువులకు ఇచ్చే తాంబూలాలు ప్రత్యేకంగా ఉంటాయి. వాటిని కొనేందుకు మహిళలు చొరవ చూపడంతో మార్కెట్‌లు కళకళాడుతున్నాయి. మరోవైపు వరలక్ష్మి వ్రతానికి విరివిగా కొనుగోలు చేసే బంగారు వస్తువుల విక్రయాలతో మార్కెట్ సందడిగా మారింది.

సౌభాగ్యం కోసం..

మహిళలు సౌభాగ్యం, సంపదల కోసం శ్రావణ మాసంలో ఆచరించే వ్రతాలలో వరలక్ష్మి వ్రతం ఎంతో విశిష్టమైంది. శ్రావణ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజున ఈ వ్రతాన్ని చేసుకోవడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. ఈనెల 16న నిర్వహించే ఈ వ్రతంలో పవిత్ర కలశాన్ని ప్రతిష్ఠించి అమ్మవారి మూర్తిని ఏర్పాటుచేసి పూజ చేస్తారు. వరలక్ష్మి పూజకు సంబంధించి వస్త్ర దుకాణాలు, బంగారుషాపులు, పూజాసామాగ్రి షాపులు కొనుగోలుదారులతో నిండిపోయి సందడిగా కనిపించాయి. అమ్మవారికి పెట్టే కాసులు బరువును బట్టి రూ.2వేల నుంచి రూ.7వేల వరకు విక్రయిస్తున్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

పార్వతీపురం టౌన్: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పార్వతీపురం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామపంచాయతీలో ఉండే చెత్త సంపద కేంద్రాలను అభివృద్ధి చేసి గ్రామాల్లో పారిశుధ్యం తొలగించే చర్యలను చేపట్టడంలో సర్పంచులు, కార్యదర్శులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో తడిచెత్త, పొడి చెత్త తొలగించడంలో కీలక పాత్ర పోషిస్తున్న గ్రీన్ అంబాసిడర్ల గౌరవ వేతనాలు స్వచ్ఛభారత్ నుంచి నేరుగా ఇచ్చే విధంగా ప్రభుత్వం ఆలోచన చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, ఎంపీడీఓ అకీబ్ జావేద్, టీడీపీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐ నందు మిగులు సీట్లు భర్తీ నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మోటర్ మెకానిక్, కోపా, వెల్డర్, డ్రస్‌మేకింగ్ ట్రేడులున్నాయన్నారు. ఆశక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 26వ తేదీలోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని, 27న కళాశాలకు వచ్చి వెరిఫికేషన్ చేయించుకోవాలని, 29వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

భారీ వర్షం



కుక్కిడిలో చెరువును తలపిస్తున్న పంట పొలం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పలు చోట్ల బుధవారం ఉదయం భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు కురిసిన వర్షానికి పంట పొలాల్లోకి నీరు పుష్కలంగా చేరింది. పలు గ్రామాల్లో పంట పొలాలు నీటితో ముంచెత్తగా.. వరద నీటి ప్రవాహం వల్ల పంట పొలాల్లో ఇసుకదిబ్బలు కట్టాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బదిలీ పీఓకు సన్మానం



దుశ్శాలువాలతో సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

సీతంపేట: ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారిగా కొద్ది రోజులే పనిచేసి బదిలీపై పశ్చిమగోదావరి జేసీగా వెళ్తున్న టి. రాహుల్‌కుమార్ రెడ్డిని ఐటీడీఏ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర, డిప్యూటీ ఈఓ పి.నారాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

గుమ్మలక్ష్మీపురం: ఎంపీడీఓ కార్యాలయం వద్ద సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 12 నుంచి జరుగుతున్న శిక్షణ తరగతులు బుధవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ రమేష్ బాబు మాట్లాడుతూ శిక్షణలో అందజేసిన సూచనలు పాటించి గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

గరుగుబిల్లి: సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు శిక్షణలో తెలియజేసిన విషయాలను గ్రామాభివృద్ధిలో సద్వినియోగం చేసుకొవాలని ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ కార్యదర్శులు, సర్పంచ్‌లకు బుధవారం మూడో రోజు ముగింపు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పరిపాలన అంశాలు, సంక్షేమ పథకాల అమలుపై ఎప్పటికప్పుడు సర్పంచ్‌లు, కార్యదర్శులు సమన్వయం చేసుకోవాలన్నారు. అభివృద్ధి పనులలో సర్పంచ్‌లను భాగస్వాములను చేయాలన్నారు. ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ ఎస్.అర్జున్‌రావు, పలువురు సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

తక్షణమే స్పందించాలి..

పాలకొండ రూరల్ : అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తక్షణమే స్పందించి నివారణ చర్యలు తీసుకోవాలని స్థానిక అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. పట్టణంలోని గాయత్రి ఒకేషనల్ కళాశాలలో బుధవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. భవనాలు, ఆస్పత్రులు, జన సమూహాల్లో అగ్ని ప్రమాదాలను సమర్థవంతగా నియంత్రించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

స్వాతంత్ర్య సమర స్ఫూర్తిని కాపాడదాం



ప్రజాసంఘాలు నిర్వహిస్తున్న జనజాగరణ కార్యక్రమం

సాలూరు: స్వాతంత్ర్య సమర స్ఫూర్తిని కాపాడదామని సీఐటీయూ, ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని రాజేశ్వరరావు పార్కు వద్ద సామూహిక జనజాగరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య గీతాలు పాడి ఉపన్యసించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారతదేశానికి స్వాతంత్ర్యం కోసం ఎందరో మహానుభావాలు త్యాగాలు చేశారని, నేడు దేశంలో కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టి దేశాన్ని ముక్కలు చేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. వాటిని అడ్డుకుని దేశాన్ని కాపాడుకోవడానికి మరో స్వాతంత్ర్య సమరం సాగించాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. దానికి ప్రజలు, కార్మికవర్గం,యువత సంసిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎన్‌వైనాయుడు, ఈశ్వరరావు, రాముడు, స్వప్న, రవి, శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల పరిశీలన



హెచ్ఎంతో పాటు విద్యార్థులకు సూచనలిస్తున్న పీఓ రాహుల్‌కుమార్ రెడ్డి

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి టి.రాహుల్‌కుమార్ రెడ్డి బుధవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భందగా విద్యార్థినులతో మాట్లాడుతూ, పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. బాగా చదువుకోవాలని హితవు పలికారు. అనంతరం విద్యార్థులకు పెట్టే ఆహారాన్ని పరిశీలించారు. విద్యార్థినులు తమకు స్పోర్ట్స్ మెటీరియల్, డ్రెస్‌లు కావాలని అడగ్గా.. పీఓ వెంటనే స్పందించి వంద మందికి మంజూరు చేశారు. జ్వరంతో పాటు ఇతర వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, ఏఎంఓ కోటిబాబు, హెచ్ఎం పద్మశ్రీ, హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల, తదితరులు పాల్గొన్నారు.